క్లుప్తంగా

అభినందన



మర్రిపాడు : ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ జీవిత సాఫల్య పురస్కారంతో పాటు డాక్టరేట్ అందుకున్న తెలుగు ఉపాధ్యాయుడు మున్నెల్లి శివశంకర్‌ను మంగళవారం చుంచులూరు ఉన్నత పాఠశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుధాకర్ మాట్లాడుతూ మన పాఠశాలకు చెందిన శివశంకర్ జీవిత సాఫల్య పురస్కారం అందుకోవడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు వెంకటరమణయ్య, మురళీకృష్ణ, మల్లికార్జున, అశోక్, పెంచలరావు, చైతన్య పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ

సోమశిల : మండలంలోని వివిధ ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులు మంగళవారం తనిఖీ చేశారు. తొలుత పాతదేవరాయపల్లి, అనంతసాగరం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ప్రైవేటు వ్యాపారుల వద్ద సుమారు 200 టన్నుల యూరియా ఉందని, ఆర్బీకేల్లో 59 టన్నులు యూరియా ఉందని, ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ, మండల ఏఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



కొండాపురం : స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓలు కె.రవికుమార్, ఆనందరావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ శాఖ రాష్ట్ర కౌన్సిలర్ జి.చినబాబు, మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేశ్వరరావు, ఎం.పుల్లయ్య, కార్యదర్శులు జి.మాల్యాద్రి, సు.దీర్, వెంకటేశ్వర్లు, రవీంద్ర పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఉదయగిరి : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఈఆర్వో మల్లికార్జున మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుర్గంపల్లిలోని 53వ నంబర్ పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి మౌలిక వసతులపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మౌలిక వసతుల గురించి తహసీల్దార్‌కు నివేదికను అందజేస్తామన్నారు. ఆయన వెంట బీఎల్వో వెంకట్, సిబ్బంది పురుషోత్తం ఉన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న ఏఈ వినయ్‌కుమార్

చేజర్ల : రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాల్సిందిగా సోమశిల ప్రాజెక్ట్ కలువాయి సబ్ డివిజన్ ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు. చేజర్ల మండలంలోని నాగులవెలటూరు ఆర్బీకేలో మంగళవారం రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నీటిని పొదుపుగా వాడుకోవాలని, వరినాట్లను జనవరి 15వ తేదీలోగా పూర్తి చేసుకోవాలన్నారు. కాలువకు దూరంగా ఉండే రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఏఓ శిరీధర్, వీహెచ్ఏ ఇమ్రాన్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి..

• వ్యక్తికి తీవ్రగాయాలు

మర్రిపాడు : మండలంలోని కొత్తఅల్లంపాడు సమీపంలో బైక్ అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పాత అల్లంపాడుకు చెందిన రాగి చెంచయ్య బైక్‌పై ఖాదర్‌పూర్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బైక్ అదుపుతప్పింది. దీంతో తీవ్రంగా గాయపడిన చెంచయ్యను 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆరోగ్య సురక్షతో ఉత్తమ వైద్యసేవలు

ఆత్మకూరురూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉత్తమ వైద్యసేవలు అందుతున్నట్లు ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెర్లోయడవల్లిలో మంగళవారం ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సచివాలయాల స్థాయిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైద్య సిబ్బంది కలిసి జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలన్నారు. అనంతరం రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూషా కుమారి, ఇతర వైద్యులు అరవింద్, రేష్మా, ఈఓపీఆర్డీ ఉషారాణి, సర్పంచ్‌లు చేరెడ్డి పద్మావతి, సోమవరపు వెంకట రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత పద్మారెడ్డి పాల్గొన్నారు.

వెంగళరావునగర్‌లో..

ఉదయగిరి : మండలంలోని వెంగళరావునగర్ సచివాలయ పరిధిలో సర్పంచ్ ఎం.తిరుపతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 205 మంది రోగులను వైద్యనిపుణులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యమే లక్ష్యంగా పలు ఆరోగ్య సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి వినీత, ఈఓపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సర్పంచ్ కల్పన, సచివాలయ కన్వీనర్ షేక్.బాషా పాల్గొన్నారు.



ఉదయగిరి : కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



దుత్తలూరు : వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వెంకట్రావు



అనుమసముద్రంపేట : మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ రమేష్‌రెడ్డి

అనంతసాగరంలో..

సోమశిల : మండల కేంద్రమైన అనంతసాగరం ప్రాథమిక పాఠశాలలో రెండో విడత ఆరోగ్య సురక్ష క్యాంపును డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మధుసూదన్ మాట్లాడుతూ 175 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోహన్ కిశోర్, కరీంమొహిద్దీన్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చేజర్ల : జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి కోరారు. చేజర్ల మండలం ఆదూరుపల్లి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్లను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. 212 మంది వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకున్నారని వైద్యులు తెలిపారు. అనంతరం కంటి అద్దాలను అందజేశారు. సర్పంచ్ నారాయణమ్మ, డీఎల్‌డీఓ రమణయ్య, ఎంపీడీఓ కరిముల్లా, ఈఓపీఆర్డీ రామయ్య, వైద్యులు పద్మావతి, పి.శివకృష్ణ, కంటి వైద్య నిపుణుడు శైలజ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే లక్ష్యం

దుత్తలూరు : పేదల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి వెంకట్రావు తెలిపారు. మండలంలోని బైరవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశిబిరాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందించేందుకు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వైద్యాధికారులు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఎంపీడీఓ సాయిప్రసాద్, సర్పంచ్ నంబూరి వసంత, వైద్యాధికారి అయూబ్ అప్సర్, ప్రత్యేక వైద్యనిపుణులు అన్వేష్, వెంకటచలపతి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

అనుమసముద్రంపేట : ప్రజారోగ్యమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జేసీఎస్ కన్వీనర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దబ్బీపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. డాక్టర్లు మంజులమ్మ, మాధవ, జస్వంత్, వినోద్‌కుమార్ తొలిరోజు 366 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నేత సూరా శ్రీనివాసులురెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్ : మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి



సోమశిల : అనంతసాగరం ప్రాథమిక పాఠశాలలో..



చేజర్ల : బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పేదలందరికీ గృహయోగం



లక్కీ డ్రా స్లిప్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలందరికీ గృహయోగం కలుగుతోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. అల్లూరు మండలం తూర్పు గోగులపల్లి గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలకు సంబంధించి మంగళవారం మహిళలతో ఎమ్మెల్యే లక్కీ డ్రా నిర్వహించి ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూర్పు గోగులపల్లి వాసుల 16 ఏళ్ల కల జగనన్న ప్రభుత్వంలో సాకారమైందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో భూ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తే కొందరు టీడీపీ నాయకులు కోర్టులో పిటిషన్ వేసి నిలిపి వేయించారన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోర్టులో ఉన్న కేసులను జయించి స్థలాలను అందజేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు వెంటనే ఇంటి పనులను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ శీనానాయక్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, అల్లూరు రూరల్ కన్వీనర్ బీద రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, వెస్ట్ బ్యాంక్ సొసైటీ చైర్మన్ భక్తవత్సల్‌రెడ్డి, రూరల్ బ్యాంక్ చైర్మన్ మేడా శ్రీనివాసులురెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేడు అనంతసాగరానికి ఎమ్మెల్యే రాక

సోమశిల : ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం అనంతసాగరానికి రానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కొత్త పింఛన్లను అందజేస్తారని మేకపాటి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదలైంది.

ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టాలి



మేట్‌లకు అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్లు

ఆత్మకూరురూరల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన ఉపాధి హామీ మేట్‌ల శిక్షణ తరగతుల్లో మంగళవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. ఉపాధి కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు రూ.272ల రోజువారీ కూలి దక్కే విధంగా పనుల కొలతలు ఇవ్వాలన్నారు. ఏపీఓ శిరీషారెడ్డి మాట్లాడుతూ సహచర కూలీలతో సమన్వయం చేసుకుని ఇచ్చిన కొలతల మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పనుల కొలతల విషయమై ఈసీ జానకీ, టీఏలు రవితేజ, వినోద్‌బాబు అవగాహన కల్పించారు.

జీవన ఎరువులపై ప్రదర్శన



రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

సోమశిల : అనంతసాగరం మండలం లింగంగుంట గ్రామంలో నెల్లూరు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జీవన ఎరువుల వినియోగంపై ప్రదర్శన క్షేత్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. నెల్లూరు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ దొరసానమ్మ మాట్లాడుతూ నత్రజని, భాస్వరం, జీవన ఎరువుల ద్వారా ఒక ఎకరానికి ఎరువుల వినియోగాన్ని 25 శాతం వరకు తగ్గించుకోవచ్చని, అదే దిగుబడి పొందవచ్చని తెలిపారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ జీవన ఎరువుల వాడకం వల్ల నేలలో భౌతిక లక్షణాలు, మొక్క పెరుగుదలకు అనుకూలంగా మారుతాయన్నారు. కార్యక్రమంలో కేవీకే ఎస్ఎంఎస్ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఏడీఏ దేవసేనమ్మ, మండల ఏఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



దుత్తలూరు : మండలంలోని నర్రవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వెంగళరావు మెమోరియల్ ట్రస్ట్ తరఫున మంగళవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌తో పాటు ఇతర విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రిని అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, దాత పచ్చవ రాకేష్, రిటైర్డ్ టీచర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ప్రజలతో మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పేదలకు ఎంతో మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. దుత్తలూరు యాదవ బజార్, బీసీ కాలనీల్లో మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు వింటూ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు మేలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. అలాంటి ముఖ్యమంత్రిని మరలా గెలిపించుకుంటే పేదలకు మరింత మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ డైరెక్టర్ దేవరపాటి సురేంద్ర, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొంతిరెడ్డి నరసింహారెడ్డి, పార్టీ నేతలు ఉప్పలపాటి రమణారెడ్డి, డబ్బుగొట్టు రమణయ్య, కండ్లగుంట కృష్ణారెడ్డి, ప్రసాద్, మురళి, సుధాకర్ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై జేసీ పరిశీలన

సంగం : సంగం తిరమనతిప్ప ఎస్టీ కాలనీలో రేషన్ డిస్ట్రిబ్యూషన్ వాహనాన్ని జేసీ కూర్మనాథ్ మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నాటికి 90 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, డీటీ ప్రవీణ్ ఉన్నారు.

రీసర్వేను వేగవంతం చేయండి

అనుమసముద్రంపేట : భూముల రీసర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జేసీ కూర్మనాథ్ అన్నారు. ఏఎస్‌పేట మండలం పెద్దబ్బీపురంలో సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అదనపు సిబ్బంది ద్వారా రీసర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు.. వైద్యులు, సిబ్బంది తగినంత మంది ఉన్నారా అని డాక్టర్ మంజులమ్మను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ మధులత, తహసీల్దార్ లక్ష్మీనరసింహ ఉన్నారు.



సంగం : రేషన్ పంపిణీపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

• కలెక్టర్ హరినారాయణన్

సంగం : ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ వైద్యులను ఆదేశించారు. సంగం మండలంలో కలెక్టర్ మంగళవారం ఉదయం విస్తృతంగా పర్యటించారు. తొలుత మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్యసేవలను పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 17 జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు జరుగుతున్నాయన్నారు. సంగం పీహెచ్‌సీలో 60 రకాల వైద్యపరీక్షలు నిర్వహించేలా ల్యాబ్ సదుపాయాన్ని మెరుగుపరచడం జరిగిందన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంపు పరిశీలన

మండలంలోని దువ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును కలెక్టర్ పరిశీలించారు. హెల్ప్‌డెస్క్, స్పాట్ సర్వే కౌంటర్, రిజిస్ట్రేషన్, కేస్ షీట్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్స్, ఓపీ ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం దువ్వూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎంహెచ్ఓ పెంచలయ్య, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ గోపి, వైఎస్సార్‌సీపీ నేత కంటాబత్తిన రఘునాథరెడ్డి, దువ్వూరు సొసైటీ చైర్మన్ సూరి మదన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.



సంగం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

అల్లూరు : అల్లూరు ఊరు ఉత్సవం సందర్భంగా గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆయా ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్ అందజేత



మర్రిపాడు : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన స్టడీ మెటీరియల్స్‌ను స్థానిక ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శాంతి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు.

జయప్రదం చేయండి

దుత్తలూరు : విజయవాడ నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 6వ తేదీ జరుగనున్న మాదిగ విద్యార్థుల జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కోలగట్ల రమేష్‌మాదిగ కోరారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ గత 30 ఏళ్లుగా ఉద్యమిస్తున్నారని, ఈ ఫలాలు త్వరలో జాతికి అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ దుత్తలూరు మండల కన్వీనర్ గంగపట్ల సింహాద్రి, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు యద్దనపూడి రమణయ్య, ఎంఎస్‌పీ మండల కన్వీనర్ అర్జున్ పాల్గొన్నారు.

తెల్లపాడులో విలేజ్ విజిట్

కలిగిరి : మండలంలోని తెల్లపాడులో ఎస్సై సంతోష్‌కుమార్ మంగళవారం సాయంత్రం విలేజ్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

అయోధ్య అక్షతలకు గ్రామోత్సవం



సోమశిల : నేత్రపర్వంగా గ్రామోత్సవం



ఆత్మకూరు : పంటవీధి రామాలయంలో పూజలు

సోమశిల : అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలో అయోధ్య అక్షతలకు మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఫొటోలతో పాటు అక్షతలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు శశి కళాధరశర్మ, రామకృష్ణశర్మ, వైఎస్సార్‌సీపీ నేతలు బత్రెడ్డి పోలిరెడ్డి, సిద్ధంరెడ్డి పెంచలరెడ్డి, రామిరెడ్డి, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం

ఆత్మకూరు : పట్టణ పరిధిలో అయోధ్య అక్షతలను మంగళవారం ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకుడు నాగరాజశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక పెద్దలు, మహిళలు, కౌన్సిలర్లు రాధిక, రమాదేవి, తిరుపతమ్మ భక్తులతో కలిసి ఇంటింటికీ వెళ్లి అక్షతలతో పాటు రామమందిర చిత్రపటాన్ని అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణ పరిధిలోని పెట్రోల్ బంక్ సమీపంలో రివర్స్ తీస్తున్న లారీ కింద పడి ఓ యువకుడు(24) మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఆత్మకూరు నుంచి బైక్‌పై నెల్లూరు పాళెం మార్గంలో వెళ్తున్న యువకుడు పెట్రోల్ పట్టించుకునేందుకు బంక్ లోపలికి వెళ్తుండగా అదే సమయంలో బంక్ నుంచి రివర్స్ వస్తున్న లారీ కింద పడి యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యాలరావు తెలిపారు.

గ్రామాల్లో క్రికెట్ పోటీలు



చేజర్ల : మండలంలోని ఆదూరుపల్లి, కోటితీర్థం, చిత్తలూరు క్రీడా మైదానాల్లో ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రికెట్ పోటీలు మంగళవారం జరిగింది. మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మల్లికార్జున పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరిముల్లా, ఈఓపీఆర్డీ రామయ్య, పంచాయతీ సెక్రటరీలు ఆంజనేయులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి : పట్టణంలోని సర్వే నంబర్ 1225లో ప్రభుత్వం తమకు మంజూరు చేసిన నివేశన స్థలాలను కొందరు ఆక్రమించారని పలువురు లబ్ధిదారులు తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008లో తమకు మంజూరు చేసిన స్థలంలో ఓ వ్యక్తి జామాయిల్ సాగు చేస్తున్నాడని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.